నిలిచిన సంచార వైద్య సేవలు

- కేంద్ర కార్మిక ఆసుపత్రికి సుస్తీ
- బీడీ కార్మికులకు అందని వైద్య సేవలు
- స్క్రాప్ సంచార వాహనం
- అద్దె భవనంలోనే కార్మిక ఆసుపత్రి
- ఎనిమిది బ్లాకుల్లో ఇదే పరిస్థితి

ముస్తాబాద్: కేంద్ర కార్మిక శాఖ సంచార వైద్యశాలకు సుస్తీ చేసింది. కనీస సౌకర్యాలు లేక కూనరిల్లుతోంది. బీడీ కార్మిక సంక్షేమ నిధి ద్వారా ముస్తాబాద్‌లో పట్టణంలో ఏర్పాటు చేశారు. వేలాది మంది బీడీ కార్మికులకు సంచార వైద్య సేవలందించడంలో ఈ వైద్యశాల విఫలం అవుతుందనే విమర్శలు వస్తున్నాయి. ఇరవై ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ఇక్కడ బీడీ కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసింది.



కేంద్ర బీడీ కార్మిక ఆసుపత్రి

ఏడు వేల మంది కార్మికులు

మండల కేంద్రంలో ఎనిమిది బ్లాకుల్లో ఉన్న బీడీ కార్మిక మహిళలు, పురుషుల కోసం ఏర్పాటు చేసిన సంచార వైద్యశాల 20 ఏళ్లుగా అద్దె భవనంలో నడుస్తోంది. ముస్తాబాద్, సిరిసిల్ల దవాఖానకు కలిపి ఒక సంచార వైద్య వాహనం కేటాయించారు. మండలంలో వారానికి రెండు రోజులు సేవలందించాల్సిన ఈ వాహనం రెండేళ్లుగా మూలకుపడింది. వాహనం చెడిపోవడంతో దానిని స్క్రాప్ కింద అమ్మకానికి కూడా పెట్టారు. కొత్త వాహనాన్ని కొనుగోలు చేయడంలో ఉన్నతాధికారులు చొరవ చూపడం లేదు. ఎనిమిది బ్లాక్ గ్రామాలైన నామాపూర్, చిప్పలపల్లి, ఆవునూర్, బందనకల్, గూడెం, కొండాపూర్, చీకోడు, తెర్లుమద్ది గ్రామాల్లోని 7 వేల మంది బీడీ కార్మికులకు వైద్య సేవలు అందించాలి. బీడీ కార్మికులు సహజంగా వెన్ను, నడుం, భుజం నొప్పితో బాధపడుతుంటారు. అలాగే శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడే వారికి మందులు ఇవ్వడంలో సంచార వైద్యం విఫలమవుతోంది.

పదేళ్లుగా స్టాఫ్‌నర్స్ ఖాళీ

అద్దె భవనంలో నిర్వహిస్తున్న దవాఖానలో స్టాఫ్‌నర్స్ పోస్టు పదేళ్లుగా ఖాళీగానే వుంది. ఒక వైద్యాధికారి, ఫార్మసిస్టుతోపాటు మల్టీ టాస్క్ స్టాఫ్ పనిచేస్తున్నారు. స్టాఫ్‌నర్స్ పోస్టు ఖాళీగా వుండడంతో మహిళా కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని 22 గ్రామాల్లో ఉన్న మహిళా బీడీ కార్మికులతోపాటు ఐదు కంపెనీల్లో పనిచేస్తున్న వంద మందికి పైగా మహిళా కార్మికులకు స్టాఫ్‌నర్స్ సేవలు అవసరమున్నాయి. స్టాఫ్‌నర్స్ పోస్టు భర్తీ



ఆసుపత్రి వార్డు

చేయడంతో పాటు సంచార వాహనాన్ని అందించాలని కార్మికులు కోరుతున్నారు. రోజు వైద్య సేవలకు 25 మందికిపైగా వస్తున్నారు.

కార్మిక దవాఖానలో అందే సేవలు

ఈ ఆసుపత్రిలో వైద్యంతోపాటు ఇతర సేవలను కూడా అందిస్తున్నారు. నిరుపేదలైన పీఎఫ్ కలిగి వున్న మహిళా కార్మికులకు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు, కార్మికుల పిల్లల చదువులకు ఉపకార వేతనాలు అందిస్తారు. వాటి ప్రక్రియను ఇక్కడి నుంచే చేపడుతారు. అలాగే ఈ శ్రమ్ కార్డుల జారీపై అవగాహన కల్పిస్తారు. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు కూడా స్కాలర్‌షిప్ లభిస్తుంది. దీనికి సంబంధించిన సేవలను దవాఖానలో అందిస్తారు. అలాగే మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు రూ.2 లక్షలు, గుండె ఆపరేషన్‌కు సంబంధించి రూ.1.25 లక్షల రీయింబర్స్‌మెంట్ ఇక్కడ లభిస్తుంది.

స్టాఫ్‌నర్స్‌ను నియమించాలి



ముస్తాబాద్ బీడీ కార్మిక ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్‌ను వెంటనే నియమించాలి. వేలాది మంది మహిళా కార్మికులు ఉన్నారు. స్టాఫ్‌నర్స్ ఉంటే చాలామంది ఆసుపత్రికి వస్తారు. ఆసుపత్రి సేవలను ప్రతి బీడీ కంపెనీలో తెలియజేస్తే వినియోగించుకుంటారు.

– శాంతమ్మ, కార్మికురాలు, ముస్తాబాద్

సంచార వాహనాన్ని మంజూరు చేయాలి



ఏడువేల మంది కార్మికులకు ఉన్న ఆసుపత్రిలో మొబైల్ వైద్య సేవలను అందించాలి. గతంలో ప్రతి గ్రామానికి వచ్చి వైద్యశిబిరాలు పెట్టేవారు. ఇప్పుడు నిర్వహించడం లేదు. కేంద్రం వెంటనే సంచార వాహనాన్ని మంజూరు చేయాలి.

– బద్దెపూరి శ్రీనివాస్, టేకేదారుల సంఘం అధ్యక్షుడు

కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి



బీడీ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఆసుపత్రిని సద్వినియోగం చేసుకోవాలి. మందులు అందుబాటులో ఉన్నాయి. మొబైల్ వెహికిల్ కోసం ప్రతిపాదనలు చేశాం. వైద్య సేవలతోపాటు కార్మికులు నిర్మించుకునే ఇళ్లకు, కార్మికుల పిల్లల చదువులకు సేవలందిస్తున్నాం.

– డాక్టర్ విక్రమ్, వైద్యాధికారి

క్లుప్తంగా

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- డీడబ్ల్యూవో లక్ష్మీరాజం



క్యారమ్ పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం అన్నారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక సత్యసాయి మందిరంలో ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. వైకల్యం అనేది శారీరానికే గాని సంకల్పానికి కాదన్నారు. అన్ని రంగాల్లో స్ఫూర్తి చాటుతున్న దివ్యాంగులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మంగళారపు రాజేందర్, మామిడాల నరేశ్, ఎల్లా హరిప్రసాద్, బొద్దుల రవి, ఆకుల సంధ్య పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

గంభీరావుపేట: స్థానిక డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులకు టాస్క్, కేరీర్ గైడెన్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. వారం రోజుల పాటు ఉద్యోగ కల్పన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న 50 మంది విద్యార్థినులను ఎంపిక చేసి కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ, లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ రాంటేక్ ఓంజి, కేరీర్ గైడెన్స్ సెల్ కో–ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి, వాణి, ఆంజనేయులు, మనోహర్, శ్రీనివాస్, బిక్షమయ్య, విజయ్, మహేశ్, రాజేశ్, శిరీశ్, శైలజ, ఉమారాణి, శ్రావణి, రజిత పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



పడిపూజలో అయ్యప్పస్వాములు

ముస్తాబాద్: మండలం మద్దికుంటలో శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం ఈరం రాజు గృహంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజుగురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు. కన్నె స్వాములతో ప్రత్యేక పూజలు చేసి అయ్యప్ప భజనలు చేశారు. అంగాంగ పూజ, అష్టోత్తర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ చీటి జితేందర్‌రావు, గురుస్వాములు నాగరాజు, నర్సింగరావు, యాదగిరి, అంజాగౌడ్, ఎల్లం, నందు, జింక తిరుపతి, కదిరె స్వామి పాల్గొన్నారు.

పరామర్శ



చందుర్తి: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వంగ వినయ్ కుటుంబ సభ్యులు, ఇదే ప్రమాదంలో గాయపడ్డ వంగ గణేశ్‌ను , బీజేపీ పార్టీ 128వ బూత్ అధ్యక్షులు పూదూరి ప్రశాంత్‌రెడ్డి తల్లి అమృతమ్మ మృతి చెందగా వీరి కుటుంబాలను వేములవాడ నియోజక వర్గ బీజేపీ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, చెన్నమనేని దీప సోమవారం పరామర్శించారు. వీరి వెంట స్థానిక బీజేపీ మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, ఉపసర్పంచ్ సిర్రం తిరుపతి పాల్గొన్నారు.

ఇసుక తరలింపును ఆపాలి

ముస్తాబాద్: స్థానిక పెద్ద చెరువులోకి వచ్చే చిన్న వాగు ఇసుక తరలింపుపై చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులకు కోరారు. రాజక్కపేట, మోహినికుంట నుంచి వచ్చే వాగు ఇసుకను రెండు నెలలుగా యథేచ్ఛగా తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఇసుక తరలింపు ఆగడం లేదన్నారు. ఇసుక తీయడంతో వాగులో కయ్యలు కొట్టి, పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ప్రజలకు రుణపడి ఉంటాం

వేములవాడ: ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం మన మధ్యలో ఉంటున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు పార్టీ శ్రేణులు ఎల్లవేళలా రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసంలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగారం వెంకటస్వామి, కౌన్సిలర్ బింగి మహేశ్, నాయకులు పుల్కం రాజు, పీర్ మహమ్మద్, చీకోటి శ్రీహరి, పులి రాంబాబుగౌడ్, కనికరపు రాకేశ్, నాగుల రాము, ముప్పిడి శ్రీధర్, నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, వస్తాద్ కృష్ణ, నాగుల విష్ణు, అక్కనపెల్లి నరేశ్, దండుగుల తిరుపతి, ఉమేందర్ పాల్గొన్నారు.

ఇది ప్రజల ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ప్రజలకు అండగా ఉంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ సంక్షేమ పథకాలను గడప గడపకు చేరుస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్, వంగ గిరిధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు చెన్నిబాబు, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్, గుండాడి రాంరెడ్డి, గంట దేవగౌడ్, బుచ్చగౌడ్, గంట అంజాగౌడ్, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కత్తెరపాక మమత సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, గ్రామశాఖ అధ్యక్షుడు ఇరువాల మహేందర్, అనుముల సురేశ్, పూదరి ఆంజనేయులు పాల్గొన్నారు.

సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుపై జిల్లా కేంద్రం సిరిసిల్లలో సంబరాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా ఉదయం కేకే మహేందర్‌రెడ్డి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సబ్బండ వర్గాల శ్రేయస్సు కోరేది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. రాబోవు రోజుల్లో ప్రజాసమస్యల పరిష్కారంలో బాధ్యతగా ఉంటామన్నారు. పీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ అధ్యక్షురాలు కాముని వనిత, సీనియర్ నాయకులు, నాయకురాళ్లు గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, యెల్లె లక్ష్మీనారాయణ, దుబాల వెంకటేశం, మడుపు శ్రీదేవి, ఆడెపు చంద్రకళ, గోలి వెంకటరమణ, వెల్మల స్వరూప, కల్లూరి చందన అన్నారు.



కోనరావుపేటలో టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ విగ్రహానికి క్షీరాభిషేకం

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన సందర్భంగా ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, బుర్ర రాములు, ఓరగంటి తిరుపతి, అంజనేయులు, వెంకటేశ్, తలారి నర్సింలు, రాజయ్య, నర్సయ్య, పోషవ్వ, లక్ష్మి పాల్గొన్నారు.

వేములవాడలో విజయోత్సవాలు

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో వేములవాడ నియోజక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ వేములవాడ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ ఉపాధ్యక్షులు న్యాత నవీన్, మండల అధ్యక్షులు సంతుపూరి బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, మండల కార్యదర్శి రాజేందర్, ఆవారి రమేశ్, అనిల్, నవీన్, సంకోజి హరీశ్, జీడి రాజు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో నాయకులు టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, ప్రధానకార్యదర్శులు గోపాల్, రుక్మిణి, బైరగోని నందూగౌడ్, కచ్చకాయల ఎల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు లింభయ్య, నాయకులు శ్రీనివాస్, భూమేశ్, రవి, ఎల్లయ్య, శంకర్, నిత్యానందం, వెంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మారంలో ర్యాలీ

మండలంలోని ధర్మారం, కనగర్తి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో వెంగళ వెంకన్న, ముచ్చర్ల తిరుపతి, దేవరాజు, కరుణాకర్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ముస్తాబాద్: పోతుగల్‌లో ఇందిరమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లక్ష్మీనర్సింహస్వామికి మొక్కులు చెల్లింపు

రుద్రంగి: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలిస్తే రుద్రంగి మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి తంతెకు ఒక కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేస్తానని మొక్కుకున్న కాంగ్రెస్ రుద్రంగి గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి ఆదివారం మొక్కు చెల్లించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి 120 తంతెలకు 120 కొబ్బరి కాయలు కొట్టాడు. రుద్రంగి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తర్రె మనోహర్, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, పల్లి గంగాధర్, గండి నారాయణ, ఇప్ప మహేశ్, పరందాములు పాల్గొన్నారు.



రుద్రంగి: ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంటలో..

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం జవారిపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు, మండల ఫిషరీస్ చైర్మన్ జెట్టి మల్లేశం ఆధ్వర్యంలో గ్రామ దేవత పోచమ్మతల్లికి సోమవారం 101 కొబ్బరి కాయలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి మాట్లాడుతూ మానకొండూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ భారీ మెజార్టీతో గెలవడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు జెమాల్, ఇల్లంతకుంట టౌన్ అధ్యక్షుడు మామిడి నరేశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మచ్చ రాజేశం, ప్రధాన కార్యదర్శి కాసుపాక రమేశ్, అల్లెపు రజినీకాంత్, కోలపురి అంతగిరి, ముజఫర్, మచ్చదాస్, బడుగు లింగం, సాయి పాల్గొన్నారు.



సిరిసిల్లటౌన్: ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

కేటీఆర్ గెలుపుపై హర్షం



గంభీరావుపేట: సంబరాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

గంభీరావుపేట: సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఐదోసారి కే.తారకరామారావు విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో సోమవారం సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, మాజీ అధ్యక్షుడు రాజారాం, పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు సిరిపురం అంజయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ లింగం యాదవ్, డైరెక్టర్ అభిలాష్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రామానుజాగౌడ్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు లతారెడ్డి, పట్టణ అధ్యకురాలు నిరంజని, మాజీ ఎంపీటీసీలు కమలాకర్‌రెడ్డి, ఎగదండి స్వామి పాల్గొన్నారు.

చిత్రకథ



ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రమాదకరమైన మూలమలుపు వద్ద ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ గుంతల మూలంగా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు



సిరిసిల్లటౌన్: ఐదు రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడు రాష్ట్రాలో తమ పార్టీ ప్రభుత్వాలు ఏర్పాటు కావడంపై బీజేపీ సంబరాలు జరిపింది. జిల్లా కేంద్రం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, శిరస్వాల్ కైలాష్, ఎనగంటి నరేశ్, కొండ నరేశ్, గాజుల వేణు, గుడ్ల విష్ణు, వంగ అనీల్ పాల్గొన్నారు.

చేరికలతో కాంగ్రెస్‌కు ఊపు

బోయినపల్లి: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొద్ది రోజుల క్రితం మండలంలో పలు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీకి మంచి ఊపు వచ్చింది. దీంతో ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు లభించాయి. మండలంలో 23 గ్రామాలు ఉండగా మెజార్టీ గ్రామాల్లో బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచులున్నారు. ఈ క్రమంలో ఓ సర్పంచ్, ఎంపీటీసీతో పాటు పలు గ్రామాల ఉప సర్పంచులు, పలువురు యువకులుకాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో భారీ చేరికలతో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వేయికి పైగా ఓట్లు వచ్చాయి. బోయినపల్లి మండలంలో మొత్తం 30,273 ఓట్లు ఉన్నాయి. వీటిలో 24,061 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన మేడిపల్లి సత్యంకు 4,640 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఆయనకు మండలంలో 12,101 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు 7,461 ఓట్లు, బీజేపీ అభ్యర్థి బొడిగ శోభకు 2,010 ఓట్లు వచ్చాయి. మొదటి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థికి మెజార్టీ వస్తుందని భావించారు. కాని వారి అంచనా తారుమారైంది. మెజార్టీ గ్రామాల్లో కాంగ్రెస్‌కు భారీగా మెజార్టీ రావడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాల్లో మునిగిపోయారు.